క్లుప్తంగా

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారి ఆలయాల్లో..



అలంకరణలో ముసలమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని గ్రామ దేవతలకు గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన ముసలమ్మ తల్లి, కాశీ విశాలాక్షి అమ్మవారు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముసలమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో మహిళలు, అర్చనలు, కుంకుమార్చనలు, అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

ఘనంగా సంకటహర చతుర్థి వ్రతం



సంకటహర చతుర్థి వ్రతం నిర్వహిస్తున్న వేదపండితులు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో ఆదివారం సంకటహర చతుర్థి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గా వినాయక ప్రతిమను శోభాయానంగా అలంకరించారు. వేదపండితులు రామేశ్వర శర్మ, చంద్రా శర్మ తదితరుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామికి అర్చన, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తాదులకు ప్రసాద వితరణ చేశారు.

'బైబిల్ స్కూల్ సద్వినియోగం చేసుకోండి'

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో జూన్ 6, 7, 8, 9వ తేదీల్లో విరామ బైబిల్ స్కూల్ తరగతులు నిర్వహించనున్నట్లు పాస్టర్, రెవరెండ్ బీవీ విశ్వమోహన్ ఆదివారం తెలిపారు. మండలవ్యాప్తంగా 1వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న క్రైస్తవ, క్రైస్తవేతర విశ్వాసుల పిల్లలు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

మండలానికి చేరిన పాఠ్య పుస్తకాలు



పాఠ్య పుస్తకాలను నంబర్-1 ప్రాథమిక పాఠశాలకు చేర్చుతున్న ఎమ్మార్సీ సిబ్బంది

యాడికి: 2024–2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేసేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు ఆదివారం మండల కేంద్రానికి రావటంతో, వాటిని నంబర్ 1ప్రాథమిక పాఠశాలలో భద్ర పరిచినట్లు ఎంఈఓ కాశెప్ప తెలిపారు. 1 నుంచి 7వ తరగతి వరకూ 7 వేల పాఠ్య పుస్తకాలు, 8వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ 11 వేల పాఠ్య పుస్తకాలు, 21,150 నోటు పుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు త్వరలో మండలానికి చేరతాయన్నారు. ప్రతి విద్యార్థికీ పాఠ్యపుస్తకాలు అందజేస్తామని ఎంఈఓ తెలిపారు.

సెంటిమెంట్ కొనసాగేనా?

శింగనమల అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. గత 45 ఏళ్లుగా ఇక్కడి ఓటర్లు విలక్షణమైన తీర్పు ఇస్తున్నారు. ఇక్కడ ఎమ్మెల్యేగా ఏ పార్టీ అభ్యర్థి గెలుస్తాడో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్ 1978 ఎన్నికల తరువాత నుంచి ఇప్పటి వరకూ కొనసాగుతూ వస్తోంది. ఈ ఎన్నికల్లో కూడా అదే సెంటిమెంట్ కొనసాగుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. శింగనమల అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు, టీడీపీ నుంచి శ్రావణిశ్రీ, కాంగ్రెస్ నుంచి శైలజానాథ్, మరి కొందరు ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల అభ్యర్థులు బరిలో ఉన్నారు.

- 21 రౌండ్లలో తేలనున్న శింగనమల నియోజకవర్గ ఫలితం
- ఒక్కో రౌండుకు 14 టేబుళ్లు
- ఒక గదిలో ఎమ్మెల్యే, మరో గదిలో ఎంపీ ఓట్ల లెక్కింపు
- ఏర్పాట్లలో అధికారులు



బుక్కరాయసముద్రం గోవిందపల్లిలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

శింగనమల: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో కౌంటింగ్ కోసం నియోజకవర్గ ప్రజలు ఎదురుచూస్తున్నారు. జూన్ 4న అనంతపురంలోని జేఎన్‌టీయూలో శింగనమల నియోజకవర్గానికి సంబంధించిన అసెంబ్లీ, పార్లమెంట్ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అందుకు ఏర్పాట్లు చేయడంలో నియోజకవర్గ ఎన్నికల అధికారులు నిమగ్నమయ్యారు. అసెంబ్లీ ఓట్ల లెక్కింపు ఒక గదిలో, పార్లమెంట్ ఓట్ల లెక్కింపు మరో గదిలో చేపడుతున్నారు. ఒక్కో గదిలో 14 టేబుళ్లు అసెంబ్లీకి, 14 టేబుళ్లు పార్లమెంట్‌కు ఏర్పాటు చేశారు. శింగనమల నియోజకవర్గంలో 2,47,373 మంది ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,22,927 మంది, మహిళలు 1,24,417 మంది, ఇతరులు 29 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 1,03,756 మంది, మహిళలు 1,01,866 మంది, ఇతరులు 20 మంది, మొత్తం 2,05,642 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 2024 మంది, 450 సర్వీసు ఓట్లకు గాను 150 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. సర్వీస్ ఓట్లను జూన్ 4న ఉదయం 7 గంటల వరకూ తీసుకోనున్నారు. ఈ క్రమంలో సర్వీస్ ఓట్లు మరిన్ని పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

పెనకచెర్ల డ్యాం బూత్ నుంచి ఓట్ల లెక్కింపు

గార్లదిన్నె మండలం పెనక చెర్ల డ్యాం నుంచి శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల ఓట్ల లెక్కింపు చేపడతారు. మొదటి రౌండులో 1–14 పోలింగ్ కేంద్రం (పెనకచెర్ల డ్యాం-కల్లూరు ఆర్ఎస్), రెండో రౌండు 15–28 పోలింగ్ కేంద్రం (కల్లూరు ఆర్ఎస్-క్రిష్టాపురం), మూడో రౌండు 29–42 పోలింగ్ కేంద్రం (ఎర్రగుంట్ల-బూదేడు), నాలుగో రౌండు 43–56 పోలింగ్ కేంద్రం (తిమ్మంపేట-తరిమెల), ఐదో రౌండు 57–70 పోలింగ్ కేంద్రం (తరిమెల-సలకం చెరువు), ఆరో రౌండు 71–84 పోలింగ్ కేంద్రం (సలకంచెరువు-శింగనమల), ఏడో రౌండు 85–98 పోలింగ్ కేంద్రం (శింగనమల-వడియంపేట), ఎనిమిదో రౌండు 99–112 పోలింగ్ కేంద్రం (పొడరాళ్ల-నీలారెడ్డిపల్లి), తొమ్మిదో రౌండు 113–126 పోలింగ్ కేంద్రం (చెన్నంపల్లి-రేకులకుంట), పదో రౌండు 127–140 పోలింగ్ కేంద్రం (అమ్మవారిపేట-బుక్కరాయసముద్రం) ఓట్లు లెక్కించనున్నారు. పదకొండో రౌండు 141–154 పోలింగ్ కేంద్రం (బుక్కరాయసముద్రం-పసులూరు), పన్నెండో రౌండు 155–168 పోలింగ్ కేంద్రం (పసులూరు-కేశేపల్లి), పదమూడో రౌండు 169–182 పోలింగ్ కేంద్రం (కేశేపల్లి-నార్పల), పద్నాలుగో రౌండు 183–196 పోలింగ్ కేంద్రం (నార్పల-శిద్దరాచెర్ల), పదిహేనో రౌండు 197–210 పోలింగ్ కేంద్రం (గొల్లపల్లి-గూగూడు), పదహారో రౌండు 211–224 పోలింగ్ కేంద్రం (గూగూడు-ఓబులాపురం), పదిహేడో రౌండు 225–238 పోలింగ్ కేంద్రం (పుట్లూరు-కోమటికుంట్ల), పద్దెనిమిదో రౌండు 239–252 పోలింగ్ కేంద్రం (చెర్లోపల్లి-గరుగుచింతలపల్లి), పంతొమ్మిదో రౌండు 253–266 పోలింగ్ కేంద్రం (వేములపల్లి-బుక్కాపురం), ఇరవయ్యో రౌండు 267–280 పోలింగ్ కేంద్రం (అరవేడు-పాతపల్లి), ఇరవై ఒకటో రౌండు 281–293 పోలింగ్ కేంద్రం (వెన్నపూసపల్లి-నీర్జాంపల్లి)లోని ఓట్ల లెక్కింపుతో ఫలితం తేలనుంది. ఈ విధంగానే మరో గదిలో పార్లమెంట్ ఓట్ల లెక్కింపు చేపడతారు.

1978 నుంచి..

శింగనమల 1978లో ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంగా మార్పు చెందింది. అప్పటి నుంచి సెంటిమెంట్ నియోజకవర్గంగా మారింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కె.ఆనందరావుపై జనతాపార్టీ అభ్యర్థి బి.రుక్మిణీదేవి విజయం సాధించారు. అప్పుడు జనతా ప్రభుత్వం ఏర్పడింది. 1983లో టీడీపీ అభ్యర్థి గురుమూర్తి గెలుపొందారు. అప్పుడు టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. 1985 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కె.జయరాం గెలిచారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పామిడి శమంతకమణి విజయం సాధించగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 1994, 1999 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కె.జయరాం విజయం సాధించగా అదే పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సాకే శైలజానాథ్ విజయం సాధించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. 2014 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి యామినిబాల గెలవగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడింది. 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జొన్నలగడ్డ పద్మావతి, 46,242 మెజారిటీతో గెలుపొందగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడింది. ఈ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు ఘన విజయం సాధించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొలువుదీరనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

నాయకుల ఇళ్లలో సోదాలు



మాట్లాడుతున్న ఎస్‌ఐ శరత్‌చంద్ర

పెద్దపప్పూరు: మండలంలోని సమస్యాత్మక గ్రామమైన వరదాయపల్లిలో ఆదివారం ఇరు పార్టీల నాయకుల ఇళ్లలో సిబ్బందితో కలసి ఎస్‌ఐ శరత్‌చంద్ర సోదాలు నిర్వహించారు. ఈ నెల 14న తాడిపత్రిలో ఇరుపార్టీల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతోపాటు జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న తరుణంలో ఎలాంటి సమస్యలు చోటుచేసుకోకుండా ముందస్తుగా రాజకీయ నాయకుల ఇళ్లలో సోదాలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో చిన్నపాటి సమస్య వచ్చినా పోలీసులకు సమాచారం అందిస్తే పరిష్కరిస్తామని ఎస్‌ఐ వివరించారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

పెద్దవడుగూరు: రౌడీ షీటర్లు శాంతియుత జీవనం గడపాలని ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం మండలంలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా దిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ రోజు టపాసులు కాల్చడం, అల్లర్లను ప్రేరేపించడం లాంటి పనులు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కౌంటింగ్ రోజు ప్రజలు సహకరించాలి

గార్లదిన్నె: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజు శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా మండలంలోని ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కోరారు. ఆదివారం ఎస్‌ఐ మాట్లాడుతూ కౌంటింగ్ రోజు ఫలితాలు వెలువడిన అనంతరం ఎలాంటి ర్యాలీలు నిర్వహించరాదని, బాణసంచా కాల్చకూడదన్నారు. అలాగే ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్న కారణంగా గుంపులుగా ఉండకూడదన్నారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో ఆదివారం బైక్ అదుపు తప్పి బోల్తా పడి రమణ, కిరణ్ అనే వ్యక్తులు గాయపడ్డారు. జెడ్ వీరారెడ్డి కాలనీకి చెందిన రమణ, కిరణ్ బైక్‌లో గుంతకల్లు రోడ్డులోని చెరువు కట్ట వద్దకు వెళుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు వెంటనే వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుక్క దాడిలో గాయాలు



గాయపడిన వెంకటరాముడు, మంజునాథ్

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం రాత్రి రోడ్డు పక్కన నిలుచుని ఉన్న వెంకటరాముడు, మంజునాథ్‌పై ఓ కుక్క దాడి చేసింది. కుక్క దాడిలో గాయపడిన వారిని స్థానికులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమచికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వారిని అనంతపురం రెఫర్ చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని బాలుడికి గాయాలు

కణేకల్లు: మండల కేంద్రంలోని దిగువవీధిలో ఆర్టీసీ బస్సు ఢీకొని యశ్వంత్ అనే బాలుడికి కాలు నుజ్జునుజ్జయ్యింది. వివరాలు.. పెద్దవడుగూరు మండలం ముప్పాలగుత్తికు చెందిన మీనాక్షి, రామాంజనేయులు కణేకల్లులో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చారు. ఇంటిముందున్న మెయిన్‌రోడ్డులో కొంతస్థలంలో షామియానా వేశారు. ఈసమయంలో ఆర్టీసీ బస్సు కణేకల్లు నుంచి ఉరవకొండకు వెళ్తోంది. అక్కడే ఉన్న బాలుడు రోడ్డుపైకి వచ్చాడు. దీంతో బాలుడి కుడికాలుపై బస్సు చక్రం వెళ్లడంతో పాదం నుజ్జునుజ్జయ్యింది. ప్రథమ చికిత్స అనంతరం బాలుడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉద్యాన రైతులకు భారీ నష్టం



తాడిపత్రిలో ఈదురుగాలులకు రాలిన మామిడి కాయలు



యల్లనూరు మండలం దంతలపల్లిలో ఈదురుగాలికి నేలవాలిన అరటితోట

తాడిపత్రిటౌన్: వర్షాలు ఉద్యాన రైతులకు అపార నష్టాన్ని మిగులుస్తున్నాయి. వర్షాలకు ఈదురుగాలులు తోడు కావడంతో ఉద్యాన రైతులు నిలువునా నష్టపోతున్నారు. తాడిపత్రి మండలంలోని చుక్కలూరు, చిన్నపోలమడ, పెద్దపోలమడ, ఇగుడూరు తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా మామిడి, అల్లనేరేడు, రేగు, సపోట, జామ వంటి ఉద్యాన పంటలు దాదాపు 4425 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మండలంలో చీనీ 1149 ఎకరాల్లో, మామిడి 840 ఎకరాల్లో, సపోట 790 ఎకరాల్లో, దానిమ్మ 506 ఎకరాల్లో, జామ 220 ఎకరాల్లో, అరటి 80 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఆయా పంటలకు ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడులు పెట్టారు. ఒక్కసారి సాగు చేస్తే దాదాపు 20 సంవత్సరాలు పంట దిగుబడులు తీసుకొవచ్చు. అయితే ఏటా ఈదురు గాలులు తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. పండ్ల చెట్లు విరిగిపోవడంతో పాటు దిగుబడులు నేలపాలు అవుతుండటంతో పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరవుతున్నాయి. అప్పు చేసి పంటలు సాగు చేస్తే తీవ్ర నష్టాలు వెంటాడుతున్నాయని రైతులు వాపోతున్నారు. రెండు రోజుల క్రితం వీచిన ఈదురు గాలులకు ఆయా గ్రామాల్లో మామిడి, సపోట, అల్లనేరేడు పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయని బాధిత రైతులు విశ్వనాథరెడ్డి, నారాయణరెడ్డి, ఆదికేశవరెడ్డి, నాగేశ్వరెడ్డి, రామక్రిష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

నష్టాల బాటలో అరటి రైతు

యల్లనూరు: ఆరుగాలం శ్రమించి పంటలను సాగు చేసిన అన్నదాతలకు ప్రకృతి ఒకవైపు.....తెగుళ్లు మరో వైపు చుట్టేశాయి. యల్లనూరు, పుట్లూరు మండలాలు ఉద్యాన పంటలకు పెట్టింది పేరు. ఈ మండలాల్లో ఎక్కువగా చీనీ, అరటి, దానిమ్మ, కర్బూజ, కలింగర తదితర పంటలను సాగు చేస్తారు. ప్రస్తుతం యల్లనూరు మండలంలో చీనీ 12,319 ఎకరాలు, అరటి 3,432 ఎకరాలు, దానిమ్మ 1,135 ఎకరాలు, కలింగర 10 ఎకరాలు సాగులో ఉంది రెండురోజుల కిందట కురిసిన వర్షం, ఈదురుగాలల బీభత్సంతో అరటి పంట నేలపాలయింది. దీంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు దంతలపల్లి సుధాకర్‌రెడ్డి, గడ్డంవారిపల్లి మధుసూదన్‌రెడ్డి కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులు స్పందించి ఆదుకోవాలని వారు కోరారు.

150 మందిపై రౌడీషీట్ నమోదు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దన్‌నాయుడు

తాడిపత్రి అర్బన్: పోలింగ్ సందర్భంగా తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లకు సంబంధించి 150 మంది నిందితులపై రౌడీషీట్ నమోదు చేసినట్లు తాడిపత్రి డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు తెలిపారు. ఆదివారం స్థానిక తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలింగ్ నాడు, ఆ తర్వాత రోజు అల్లర్లలో పాల్గొన్న తాడిపత్రి పట్టణానికి చెందిన 106 మంది, యాడికిలో 37 మంది, పెద్దవడుగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరిపై రౌడీషీట్ ఓపెన్ చేసినట్లు వివరించారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడినా.. ఉపేక్షించబోమన్నారు. అల్లర్లలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి వారిపై కచ్చితంగా రౌడీషీట్ తెరుస్తామన్నారు. ప్రశాంత జీవనానికి భంగం కలిగించే అనుమానాస్పదులపై నిఘా ఉంచామన్నారు. ఇప్పటికే తాడిపత్రి సబ్ డివిజన్ మొత్తం పోలీసు కంట్రోల్‌లో ఉందన్నారు. రాజకీయ పార్టీల నాయకుల ఉచ్చులో పడి పోలీసు కేసుల్లో ఇరుక్కోకుండా ఉండాలని యువతకు హితవు పలికారు. ఒక్కసారి ఎఫ్ఐఆర్ నమోదైతే చచ్చేంత వరకూ కేసుల రూపంలో వెంటాడుతూ ఉంటుందని హెచ్చరించారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల కవాతు



పుట్లూరు మండలం మడుగుపల్లిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పుట్లూరు: సమస్యాత్మక గ్రామాల్లో ఆదివారం స్పెషల్ రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలతో కలిసి సీఐ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలోని శనగలగూడూరు, గరుగుచింతలపల్లి, కోమటికుంట్ల, మడుగుపల్లి, ఓబుళాపురం, కడవకల్లు, కొండాపురం గ్రామాల్లో పోలీసులు పర్యటించారు. అలాగే ఆయా గ్రామాల్లోని ప్రజలతో వారు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల అనంతరం విజయోత్సవాలు నిర్వహించడం నిషేధమన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ హేమాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: మండలంలోని దంతలపల్లి, తిమ్మంపల్లి, కల్లూరు, వెన్నపూసపల్లి, యల్లనూరు, మేడికుర్తి గ్రామాల్లో పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ గిరిబాబు ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సీఐ మాట్లాడుతూ పల్లెల్లో 144 సెక్షన్ అమల్లో ఉందని, ఎక్కడా గొడవలు పడొద్దన్నారు. అల్లర్లకు పడితే జైలుకు పంపుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌జీఎఫ్, స్పెషల్‌పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు



గొడ్డుమర్రిలో కట్టెలపై తీసుకెళ్లిన ప్రధాన లైను



విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగలు

యల్లనూరు: మండలంలోని గొడ్డుమర్రి లక్షుంపల్లి గ్రామాల నడుమ ఉన్న విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. పలుమార్లు చెప్పినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోలేదని పలువురు రైతులు వాపోయారు. పలు చోట్ల స్తంభాలు లేక కట్టెలపై విద్యుత్ తీగలు ఉన్నాయి. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఏఈ పద్మనాభరెడ్డి మాట్లాడుతూ పొలాలు, ఇళ్లల్లో విద్యుత్ సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు.

ముగిసిన ఖాజా బందేనవాజ్ ఉరుసు



హజరత్ ఖాజా బందేనవాజ్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు

గుత్తి: పట్టణంలోని కర్నూలు రోడ్డు సమీపంలో మన్రో సత్రం వద్ద హజరత్ ఖాజా బందేనవాజ్ గ్రేస్ దాస్ దర్గాలో మూడో రోజు ఆదివారం జియారత్‌తో ఉరుసు ఘనంగా ముగిసింది. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఉరుసు నిరాడంబరంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు దర్గాలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు అఫ్జల్ బాషా, ఖలీల్, రషీద్, సైదు, రహంతుల్లా, డిష్ ఖాసీం, షఫి, రఫి, పాషా, నబి తదితరులు పాల్గొన్నారు.



పామిడి టీసీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళన దృశ్యం



శింగనమల జెడ్పీ హైస్కూల్‌లో కలసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పామిడి: స్థానిక టీసీ హైస్కూల్‌లో 2002–2003లో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబాల బాగోగులను గురించి ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయ బృందం నాగరాజు, రామాంజనేయులు, జయరాజు, ఓంకార్, సాయిక్రాష్ణ, రామ్మోహన్, పీడీ నాగరాజు, అరుణ, చంద్రలీలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బీ షెక్షావలి, సూరిరావు, విశ్వనాథ్, సూర్యనారాయణ, ధర్మపాల్, నరేష్, శివ, పుంజా మురళీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శింగనమల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల వేదికగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్‌లో పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భరత్‌కుమార్, శ్రీనివాసులు, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.